# విహంగం

జయంతి

ఆమె ముప్ఫైఏళ్ళ వయసున్న ఆడది. ఏభైఏళ్ళ ముదుసలిలా వుంది. ఆమె యవ్వనంగా లేదు. ఆమె యవ్వనాన్ని దారిద్ర్యం అపహరించినట్లు ఆమెవుంది. ఆమె ఎముకల గూడులావుంది. ఆమెలోని మాంసాన్ని దారిద్ర్యం చీదపురుగులు కొరుక్కుతినేసినట్లు ఆమెవుంది. కన్నీళ్ళు ఆమె కళ్ళల్లోని సోయగాన్ని కబళించినట్లు వుంది. ఆమెలోని రక్తాన్ని ఆకలిజలగలు పీల్చేసినట్లు ఆమెవుంది.

ఆమె చీరకట్టుకోలేదు. ఆమె నగ్నంగా లేదు లేదు. ఆమె ఎర్రికోకలో అర్థ భాగం చుట్టబెట్టుకుంది. ఆ ఎర్రికోక గుడ్డముక్కలే ఆమెదగ్గరున్న ఆమె ముగ్గురు పిల్లలూ కట్టుకున్నట్లు తెలుస్తూంది. ఆమె రవిక ధరించలేదని చెప్పనవసరం లేదు. వయసులో తప్ప ఆమె పోలికలన్నీ ఆపిల్లలకున్నాయి.

ఆమె ఎండిపోయిన మర్రిచెట్టుదగ్గర కూర్చుంది. ఆమెపిల్లలు ఎండిపోయిన పుల్లలు ఏరుతున్నారు. ఆమె దీనంగా విలపిస్తూంది. ఆమె విలాపాన్ని వినలేనన్నట్లు సూర్యుడు పడమటి కొండవైపు పారిపోతున్నాడు. పక్షులు ఆమెదైన్యాన్ని చూడలేమన్నట్లు చెట్టుపైవాలిన వెంటనే ఎగిరిపోతున్నాయి. ఆ చెట్టుకూడా విలపిస్తున్నట్లు కన్నీళ్ళలా ఎండుటాకులను టప టప రాలుస్తూంది.

అప్పుడు నేను అక్కడకు వెళ్ళడం జరిగింది. విలపిస్తున్న ఆమెను వీక్షించడం సంభవించింది.

అప్పుడు నాకు ఆమెమీద జాలికలిగింది. జాలి, కనికరం, దయా, దానం దైన్యాన్ని తొలగించలేవనీ, దారిద్ర్యాన్ని నిర్మూలించలేవని నాకు అప్పటికితెలీదు. అవి దైన్యవిముక్తిమార్గంలో అడ్డంకులే అనికూడా అప్పటికి నాకుతెలీదు. జాలిపడ్డం మాత్రం అమితంగా అప్పటికి నేను నేర్చుకున్నాను. అంచేత ఆమెమీద అమితమైన జాలికలిగింది. అంచేత ఆమెను ఆమెదైన్యానికి కారణం చెప్పమని అడిగాను.

ఆమె నావైపు చూసీచూడనట్లు వూరుకుంది. నేను అడిగినదానికి జవాబు చెప్పలేదు. ఆలాపన మాత్రం ఆపుచేసింది. కన్నీళ్ళు మాత్రం కారుతూనేవున్నాయి. ఆమె నిర్లక్ష్యంగా. నిర్లిప్తంగా వుండిపోయింది.

ఏ దేవుడూ ఆమె దీనత్వాన్ని పారద్రోలడానికి ప్రత్యక్షం కాడని ఆమె భావించి నాకు జవాబు యివ్వలేదని నేనప్పుడు భావించాను ఏ మనిషి ఆమె దైన్యాన్ని తొలగించడానికి ముందుకురాడని ఆమెతలచి మౌనంగా వుండిపోయిందని నేనప్పుడు తలచాను.

ఆమె దైన్యం నా హృదయాన్ని హింసిస్తే, ఆమె మౌనం నా మదిని పీడించింది.

నేను అడుగునున్న వారిభుజాలమీద నిలబడి పైనున్నవారి కాలివేళ్ళు పట్టుకొని పైకెగబ్రాకాలని పాటుపడుతున్న యువకుణ్ణని ఆమెకు తెలిసిపోయినట్లు నేను భయపడ్డాను. నా దౌర్బల్యాలు ఆమెకు విదితం అయిపోయినట్లు నేను వ్యధపడ్డాను. నా చదువు నాకు లోకంగురించి చెప్పలేదని, సంఘం గురించి తెలియజేయలేదని, న్యాయం బోధించలేదనీ, అన్యాయాలను హతమార్చాలని హితబోధ చెయ్యలేదని, నన్ను అక్షరాలు ముద్రించే అచ్చు యంత్రంలా తయారుచేసిందని ఆమెకు తెలిసిపోయినట్లు నేను చింతించాను. న్యాయంకోసం నిలబడే నిజాయితీ, గుండె నిబ్బరం నాకులేవని ఆమెకు తెలిసిపోయినట్లు నేను విచారించాను నేను స్వార్థం ఊయలలో ఉయ్యాలలూగే పసివాణ్ణని ఆమె గ్రహించినట్లు నేను భీతిల్లాను. అందుకే ఆమె నాకు జవాబుచెప్పలేదని నేను కుదించుకుపోయాను. అప్పుడు నేను నిస్సహాయంగా నిలబడిపోయాను. దీనంగా ఆమె ముఖంలోకి చూసాను. అప్పుడు ఆమె నాముఖంలో దీనత్వాన్ని చూసింది. ఆమెకు నామీద జాలికలిగింది. ఆమె అప్పుడు ఆమె కథను నాకుచెప్పింది.

ఆమె ఆడది అవడంవల్ల ఆమెకొక మొగుడుండేవాడట. అతడు చదువుకోక పోవడంవల్ల కాయకష్టంమీద బ్రతకవలసి వచ్చిందట. చదువుకోకపోయినా, మాయా-మోసం చేయడం రాకపోడంచేత శరీరబలంమీద తప్పకుండా జీవించవలసి వచ్చిందట. అతడు రాజకీయాల్లో తలదూర్చకపోడంచేత, సుఖంగా బ్రతకడానికి కష్టంలేకుండా డబ్బు సంపాదించలేక పోయాడట. అతడొక కర్రలవ్యాపారివద్ద కట్టెలుకొట్టేవాడిగా జీవిస్తూ వుండేవాడట. పెళ్లయిన కొత్తలో, యవ్వనంపొంగులో, దరిద్రం దహిస్తున్నా కామం కట్టలు త్రెంచుకోడంవల్ల, కష్టాల్ని లెక్కజేయకుండా సుఖంగా కొన్నాళ్ళు జీవించినట్లు వాళ్లు భావించారట. తర్వాత అతడు కండలు కరుగుతున్నా కడుపునిండక పోవడంవల్ల పెళ్ళాడ్డం పొరపాటని గ్రహించాడట. తిండిలేని తనకు ఆకలితోపాటు ఆడదానికోసం ఆకలితో పుట్టించిన దేవుణ్ణి తర్వాత తిట్టాడట. తర్వాత అతనికి పెళ్లాం వుండడంవల్ల ముగ్గురు పిల్లలు పుట్టారట, ఆమె ఆరోగ్యం చెడిపోయిందట, అంచేత

ఆమె ఏపనీచేసి, ఏవిధంగానూ భర్తకు సహాయం చేయలేకపోయేదట. అప్పుడతడు తన జీవితాన్ని శాపంగా భావించాడట. పెళ్ళాన్ని పిల్లల్ని ఆకలికి అర్పించినందుకు, తన్ను అగ్నికి అర్పించుకోవాలన్నంత నిరాశగా, నిస్పృహగా జీవితాన్ని గడుపుతూ వుండేవాడట.

ఆ పచ్చికలపకు కండచీమలూ, ఎండుకలపకు బండచీమలూ అంటిపెట్టుకుని గుంపులుగా వుండేవట. ఎంత జాగ్రత్తగావున్నా, అవి అతణ్ణి కరుస్తూవుండేవట. అతడు రోజూ రాత్రి గుడిసెముందు కుక్కినులక మంచంమీద నడుం వాల్చేవాడట. అతడికి ఆకలిమంటకు తోడు చీమలుకుట్టిన మంటతోడై పెళ్ళాంమీదా, దేవుడిమీద, దరిద్రంమీదా, దానవులమీద మండిపడిపోతూవుండేవాడట.

అతడు గుడిసెముందు మంచంమీద దొర్లుతూ ఆకాశంలోకి చూస్తూ, ఆలోచించుకుంటూ నిద్రలేకుండా గడుపుతూవుండేవాడట. అప్పుడు కండలు కరుగుతున్నా తిండి లేకపోవటం- చెమటబిందువు రాలకుండా కనకరాసులు కూడటం— అలాంటి దృశ్యాలు అతని కళ్ళముందు తిరుగుతున్నట్లు అతడు ఆమెతో చెప్తువుండేవాడట. ఆ కనకరాసుల వెనక- నేరాలపోగులూ- మోసాలకుప్పలూ- కన్నీటికాల్వలూ- రక్తప్రవాహాలు- అతడు విన్నవీ- కన్నవీ ఆమెకు కథలుగా కబుర్లుగా చెప్తూవుండేవాడట, అలా నిద్రకూడా లేకుండావుంటూ వుండడంవల్ల అతని ఆరోగ్యంకూడా చెడిపోయిందట. అప్పుడతనికి క్రమంగా న్యాయంమీద నమ్మకం పోయిందట. ధర్మంమీద అసక్తిచచ్చిపోయిందట. అహింస అబద్ధమని అంటూవుండేవాడట. 'మన దరిద్రం ఎలాపోతుంది? మన ఆకలి ఎలాతీరుతుంది? మన రోజులు ఎలాగడుస్తాయి? మనకష్టాలు ఎలాగట్టెక్కుతాయి?' అని అతడు తరచుగా ఆమెతో అంటూవుండేవాడట, ఆవేదన పొందుతూ వుండేవాడట!

ఒకరోజు అర్ధరాత్రివేళ అతడు వాకిట్లో మంచంమీద పండుకుని వున్నప్పుడు ఎవరో ఇద్దరు మగాళ్ళు వచ్చారట. వాళ్ళ ఎత్తుగా లావుగా, బలంగా వున్నారట. వాళ్లు ఆమెభర్తతో కొంతసేపు గుసగుసలాడేరట. అప్పుడతడు గుడిసెలోకి వచ్చాడట. దీపం చేత్తోపట్టుకుని నిద్రపోతున్న ముగ్గురు పిల్లల్నిచూసాడట. ఆమెకదేమీ అర్థంకాలేదట. ఆమెకు ఎందుకో భయంమాత్రం వేసిందట. అతడు దీపం చేత్తోపట్టుకుని ఆమెముఖంలోకికూడా చూసాడట. ఆమెవంటిమీద చెయికూడా వేశాడట. అప్పుడతని కళ్ళల్లో నీళ్ళు గిర్రునతిరిగాయట. అతని చేతులు కంపించాయట. ఆమెకళ్ళు అప్రయత్నంగా నీళ్ళతో నిండాయట. అతడు ఆమెతో ఏమీచెప్పకుండా వాళ్లతోకలిసి వెళ్లిపోయాడట.

346

ఆ మర్నాడు అతడు ఇంటికి తిరిగిరాలేదట. ఆమె అతనికోసం నిరీక్షించిందట. ఆమె అతనికోసం వెదికిందట. కానీ, అతడిగురించి ఆ మెకు ఏమీ తెలియలేదట. ఆమూడోనాడు అతడు చచ్చిపోయినట్లు ఆమెకు తెలిసిందట. అతడు ఎలా చచ్చిపోయాడో ఆమెకు ఆ తర్వాత తెలిసిందట. అన్నివూళ్లల్లోలాగే ఆవూళ్ళోకూడా ఒక ధనవంతుడున్నాడట. ఆ ధనవంతుడు చాలా గొప్పధనవంతుడట. ఆ ధనవంతుడికి ఒకవిరోధి వున్నాడట. ఆ విరోధి బీదవాడో ధనవంతుడో ఆమెకు తెలీదుట కానీ అతడు చాలా బలవంతుడని ఆమెకు తెలుసునట. ఆ ధనవంతుడు ఆ బలవంతుడైన తనవిరోధిని చంపినవాడికి ఐదువేల రూపాయిలు ఇస్తానన్నాడట. ఒక ఇద్దరు ఆపనికి ఆ డబ్బుకోసం అంగీకరించి తిండిలేకపోయినా గుండెవున్న ఆమె భర్తను తీసుకునివెళ్ళిపోయారట. 'మన దరిద్రం ఎలాపోతుంది? మన ఆకలి ఎలాతీరుతుంది! మనరోజులు ఎలా గడుస్తాయి? మనకష్టాలు ఎలా గట్టెక్కుతాయి!' అని అలమటిస్తున్న ఆమెభర్త ఆపనికి వొప్పుకుని వుంటాడనీ, ఆ తణ్ణి చంపబోయి, తనభర్తే హతుడయ్యాడని ఆమెచెప్పి కన్నీరు బొటబొట కార్చింది

ఆనాటినుండి ఆమె భర్తకోసం దుఃఖిస్తూ అనారోగ్యంతో వ్యధపడుతూ ఆకలితో అలమటిస్తూ పిల్లలకోసం జీవిస్తూంది. ఆమె జాలిగా రోదిస్తూ, దీనంగా విలపిస్తూ జీవిస్తూంది.

ఆమె కథవిన్న నాకు అమితంగా ఆమెమీద జాలికలిగింది. అపరిమితంగా దుఃఖం వచ్చింది. ఒక పతితను పెళ్ళాడ్డంవల్ల వాళ్ళసమస్య తీరదని నాకుతెలుసున్నా, దానాలు గర్భస్రావాల్లాంటివని నాకుతెలీదు. నీతినియమాలు ఒకనాటి స్వార్థం కబంధహస్తాలు గీసిన సొట్టగీతలనికూడా నాకుతెలీదు. ఐదురూపాయల కాగితం ఆమె ఆర్తిని తొలగించలేదని కూడా నాకుతెలీలేదు. అంచేత ఐదురూపాయల కాగితం ఆమెకు ఇవ్వబోయాను. ఆమె చిన్నకుర్రాణ్ణి చంకనపెట్టుకుని ఆడబ్బు పుచ్చుకోకుండా ఏడుస్తూ వెళ్ళిపోయింది. ఆమె ఇద్దరుపిల్లలూ రోదిస్తూ ఆమె వెంటపరుగెత్తారు.

"ఏంబాబూ! సూసినా, ఎండిపోయిన తుప్పనాగున్న నన్నుసూసినా, అప్పడంలా గంటుకుపోయిన నాకడుపు సూసినా, కుక్క ఎత్తుకుపోతున్న ఎమికనాగున్న నాబిడ్డల్ని సూసినా, నాబరత ఎందుకసచ్చిపోనాడో నీకు అరదమయిందా. కడుపునిండా కూడు న్నోడివి నీకేటితెల్సు మాకట్టాలు. నీకేటితెల్సు ఆకలిమంట. ఏదీ సూడూ, ఒకపొద్దు దేవుడికోచమైనా ఉపాసముండి సూడూ. తెలుద్దినీకు ఆకలిబాధ! నీకడుపునిండితే నీకు

పాలు! ఓరెలాపోతే నీకేటిసెప్పు? ఓరుతినకపోతే నీకేటి? ఓరెలాసత్తే నీకేటి! నానుకూడాసత్తే నాపిల్లలగతేటి? నాకు మాసెడ్డకోపం వత్తూంది. నామాట ఇను. ఆ అయిదురూపాయిలూ పట్టుకెలితే ఓగుంట ఓపాలి ఒంటిమీద సెయి ఎయినిత్తాది. నేకపోతే అడబ్బుతో సుక్క ఏసుకుని సక్కాలొంగో. నాకు వొల్లుమండిపోతుంది. ఏంబాబూ! నువేటి సదుంకున్నావేటి? ఐదురూపాయిల కాయితంతో మా యాతన ఎల్లగొట్టాలనుకున్నావేటి? సెప్పు. బాబూ సెప్పు. నీకేమెలకువుంటే మాబతుకులిలా బందబారిపోతాయా? నీకే సత్తావుంటే, తిండినేకుండా మామిలా మాడిసత్తామా! సెప్పు బాబూ సెప్పు" అని ఆమె అన్నట్లు నాచెవులు విన్నట్లు నాకప్పుడనిపించింది.

నేను భారంగా ఇల్లు చేరుకున్నాను. ఆనాటినుండి ఆక్షణంనుండి, నామనసు పరిపరివిధాల పరుగులుతీసింది. నామది వెయ్యివిధాల ఆలోచించింది, నామనసు కొటి మిటలాడింది. నామది విరామంలేకుండా ఆరాటం పడింది. కొంతకాలానికి నాకు ఆమె నాదేశంలో అత్యంత పెద్దభాగమని అర్థమయింది. మరికొంత కాలానికి ప్రేమ సమాజాలు పెట్టడంద్వారా మానవత్వం వర్ధిల్లదనికూడా నాకు బోధపడింది. 'పో, పో, దారిద్ర్యమా!' అంటే పోదుపోదని చాలామందికి తెలిసినట్లు నాకుకూడా తెలిసింది!

మరికొంత కాలానికి- మరోనాడు- అప్పుడే తెల్లవారింది. నాకు మెలకువ వచ్చింది. 'మన దరిద్రం ఎలాపోతుంది? మన ఆకలి ఎలాతీరుతుంది? మనరోజులు ఎలా గడుస్తాయి? మనకష్టాలు ఎలా గట్టెక్కుతాయి?' ఆ మాటలు- ఆకట్టెలుకొట్టు వానిమాటలు నాచెవిలో మ్రోగాయి. అంతలో భాస్కరుడు ఎర్రగా ఎర్రగా ఉదయించాడు. ఆకాశం ఎర్రబడుతూంది. ఒక విహంగం ఉత్సాహంగా రెక్కలు ఆడిస్తూ ఎర్రబడుతున్న తూరుపుదెసకు పరుగులుతీసింది. ఆ కట్టెలుకొట్టువాని ప్రశ్నలకు జవాబు దొరికింది.

## జాలి

కె. వి. యస్. వర్మ

ఒక టౌన్‌లో
రైల్వే స్టేషన్‌లో
మండుటెండలో

ఇటువైపు ప్లాట్‌ఫారమ్ నుంచి అటువైపు ప్లాట్‌ఫారమ్ మీదకి వెళ్ళడానికి కట్టిన ఓవర్ బ్రిడ్జీమీద అటూయిటూ దీనంగా దైన్యంగా ఆకలిచూపులు చూస్తూ కూర్చున్నారు భిక్షగాళ్లు, ఆడా- మగా.

348